క్లుప్తంగా

వెబ్ సిరీస్ దర్శకుడికి సన్మానం



దర్శకుడు ప్రవీణ్‌శ్రీని సన్మానిస్తున్న వరుణ్‌వందే

కడ్తాల్: ఇటీవల ఓటీటీలో విడుదలై అద్భుత విజయం సాధించిన 'న్యూసెన్స్' వెబ్ సిరీస్ దర్శకుడు, మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ శ్రీ(బాచిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి)ని, యువ మోర్చా రాష్ట్ర నాయకుడు వరుణ్‌వందే శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్‌శ్రీ సినీ రంగంలో రాణించడం నియోజకవర్గానికి గర్వకారణమన్నారు. గతంలో ప్రవీణ్ శ్రీ దర్శకత్వంలో వచ్చిన సినిమాలు కాళీచరణ్, గాయం-2 సినిమాలు అద్భుత విజయాలు సాధించాయని గుర్తు చేశారు. యువత ఇలాంటి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని వివిధ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి మాతృమూర్తి రుకుణమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వారి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవితేజ, ఎంపీటీసీ సభ్యుడు లచ్చిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాదారంలో నిర్మిస్తున్న మైసమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కందుకూరు మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన బుర్ర చెన్నయ్య రూ.51 వేలు, మక్తమాదారం గ్రామానికి చెందిన అంకారి శేఖర్ రూ.10వేల విరాళం అందించారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, గిరి, మైసయ్య, కిష్టయ్య, వెంకటయ్య, చందు, సాయిలు, రామయ్య, జంగయ్య, గోపాల్, శ్రీరాములు ఉన్నారు.

సిటీ సబర్బన్ బస్సు సర్వీసులు వేయండి

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి



ఓఎస్డీ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: హైదరాబాద్ నుంచి కడ్తాల్ మండల కేంద్రానికి సిటీ సబర్బన్ సర్వీసులు నడిపించాలని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి టీఎస్ ఆర్టీసీ బస్‌భవన కార్యాలయం ఓఎస్డీ భానుప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడితో కలిసి ఓఎస్డీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి నిత్యం విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారని వారి వారు బస్‌పాస్‌కు అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం కందుకూరు వరకు ఉన్న సర్వీసును కడ్తాల్ వరకు పొడగించాలని కోరారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సిఫారసు పత్రం, పంచాయతీ పాలకమండలి వినతిపత్రం ఓఎస్డీకి అందజేశారు. సాధ్యమైనంత త్వరగా సబర్బన్ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మూగ జీవాల వధ నేరం

హిందూవాహిని నాయకులు అభిషేక్‌రెడ్డి, భాను

మంచాల: మూగ జీవాలను చంపడనం నేరమని హిందూవాహిని నాయకులు అభిషేక్ రెడ్డి, భాను అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆగాపల్లి గ్రామంలో వ్యవసాయ పనులను వాడే ఎద్దులను ముస్లింలు వధిస్తుండగా వారు వెళ్లి అడ్డుకుని మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో హింస చట్టరీత్యా నేరమని తెలిసినా వధించడం సరికాదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంచాల ఎస్సై రవినాయక్ తెలిపారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఆమనగల్లు: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్

మంచాల: ప్రతీ పేదవాడికి కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన కొండూరు సతీశ్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆస్పత్రి ఖర్చులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50లక్షల విలువైన ఎల్‌ఓసీని శుక్రవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, గ్రామ అధ్యక్షుడు రాము, కార్యదర్శి మహేందర్, నాయకులు ఐలయ్య, శ్రీకాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మైద్యారోగ్యానికి పెద్దపీట

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలోని సూరజ్‌నగర్ కాలనీకి చెందిన వి.విద్యాసాగర్ కూతురు సాధన అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో విద్యాసాగర్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో శుక్రవారం బాధితురాలికి మంజూరైన రూ.2.30లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఐలయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, నాయకులు కృష్ణ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

ఆమనగల్లు: మండల పరిధిలోని కొత్తకుంట తండాకు చెందిన కేతావత్ శాంతి అనారోగ్యంతో నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.1.25లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం నగరంలోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దోనాదుల కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చందునాయక్, పార్టీ నాయకులు శ్రీరాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే ప్రాధాన్యం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



లబ్ధిదారులకు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పేదల సంక్షేమానికే తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం కావేరి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టాల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కులవృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేసే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండల వ్యాప్తంగా జీఓ 59 ద్వారా 605మందికి లబ్ధిచేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఆర్డీఓ వెంకటాచారి, మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, వైస్ చైర్ పర్సన్ సంపూర్ణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దేవదాస్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ అనితారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లను క్రమబద్ధీకరించండి

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీలో పేదలు నిర్మించుకున్న ఇండ్లను 58, 59 జీఓల కింద క్రమబద్ధీకరించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ సీపీఐ నాయకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి మాట్లాడుతూ.. 15ఏళ్లుగా పేదలు ఆర్‌ఎన్‌ఆర్(రావి నారాయణరెడ్డి) కాలనీలో నివాసముంటున్నారని వారు అప్పటి నుంచి కరెంట్, నల్లా బిల్లులు, ఇంటి పన్నులు చెల్లిస్తున్నారని వివరించారు. వారి దరఖాస్తులను జీఓ 58,59 ప్రకారం క్రమబద్ధీకరించాలని కోరారు. సదరు భూమిపై ఎలాంటి కేసులు లేకుంటే తప్పకుండా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్ నాయక్, వేణుప్రసాద్, పుల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4 పరీక్షలకు 23 కేంద్రాలు

ఐదు రూట్లు.. పకడ్బందీగా బందోబస్తు

ఇబ్రహీంపట్నం: మండల పరధిలోని 23 కేంద్రాలల్లో గ్రూప్-4 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను ఐదు రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌లో ఒక ఆఫీసర్‌ను ప్రత్యేకంగా నియమించినట్లు వివరించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు పేపర్-2 ఉంటుందని వివరించారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు వరకు అభ్యర్థులను అనుమతించి అనంతరం మూసివేస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఉంటుందని సీఐ రామకృష్ణ తెలిపారు.

'గ్రూప్-4'కు మూడు పరీక్ష కేంద్రాలు

యాచారం: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించే గ్రూప్-4 పరీక్షలకు మండల పరిధిలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుచరిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గునుగుల్ ఆదర్శ పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మాల్, సెయింట్ స్టిఫన్ పాఠశాలలో 816 మందికి కేటాయించినట్లు ఆమె వివరించారు.

ఇన్విలేటర్లతో సమీక్ష

తలకొండపల్లి: గ్రూపు-4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్, డిపార్ట్‌మెంట్ అధికారి సంతోశ్ ఇన్విజిలేటర్లకు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జెడ్పీహెచ్‌ఎస్‌లో డీటీ సంతోశ్, చీఫ్ సూపర్‌వైజర్ భగవాన్‌రెడ్డి ఇన్విజిలేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష సరళిని వివరించారు. 192 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భగ్‌వాన్‌రెడ్డి, ఆర్‌ఐ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ పునఃప్రారంభించండి



అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీశైలం తదితరులు

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఉన్న ఎస్సీ హాస్టల్ పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శుక్రవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు లేరనే సాకుతో హాస్టల్ మూసివేశారని.. పునః ప్రారంభించి విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, గ్రామస్తులు మల్లేశ్, కుమార్, జంగయ్య, అంజయ్య, మధుకర్‌రెడ్డి, మహేందర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి సర్వే నెంబరు 115 ,241, 86, రాందాస్‌పల్లిలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు శుక్రవారం దాడులు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, పుష్పలత ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

టార్గెట్ మేరకు మొక్కలు నాటాల్సిందే

ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: గ్రామాల్లో టార్గెట్ల ప్రకారం మొక్కలు నాటాల్సిందేనని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమయ్యారు. నర్సరీల్లో పెంచిన ప్రతీ మొక్కను నాటాల్సిందేనని అన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసే లోపు గుంతలు తీసే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని అన్నారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా పారిశుద్ధ్యం, తాగునీటి పైపుల లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆశీర్వదిస్తే.. సేవకుడిలా పనిచేస్తా

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి
- నియోజకవర్గ పరిధిలో భారీ ర్యాలీ



కడ్తాల్: ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు సేవ చేసేందుకే మాతృభూమికి వచ్చానని.. వారు ఆశీర్వదిస్తే సేవకుడిలా పనిచేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్‌పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు. నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎనముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన తొలిసారి కల్వకుర్తి నియోజక వర్గానికి వస్తున్న సందర్భంగా ఆయనకు మద్దతుగా కడ్తాల మండలం ముచ్చర్ల గేటు నుంచి కడ్తాల, ఆమనగల్లు, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, కల్వకుర్తి వరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో ర్యాలీలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికి అమెరికా పౌరసత్వం వదులుకుని కల్వకుర్తి నియోజక వర్గానికి వచ్చానని చెప్పారు. ఏడాది కాలంగా ఐక్యత ఫౌండేషన్ పేరుతో నియోజక వర్గ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు, నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయిన వివరించారు. భవిష్యత్తులో ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజల మధ్యే ఉంటూ సేవకుడిలా పని చేస్తామని సుంకిరెడ్డి హామీ ఇచ్చారు.

ర్యాలీ విజయవంతం

సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ భారీ ర్యాలీ విజయవంతమైంది. ర్యాలీకి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున హోర్డింగ్‌లు, స్వాగత తోరణాలు, పార్టీ జెండాలను ఏర్పాటు చేశారు. ర్యాలీలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సందడి చేశారు. ర్యాలీలో కోలాటం, డప్పుకొమ్ములు, బ్యాండు వాయిద్యాలు, కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఓపెన్‌టాప్ జీప్ నుంచి సుంకిరెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆమనగల్లులో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, అమరవీరుల స్థూపం వద్ద సుంకిరెడ్డి నివాళి అర్పించారు. ర్యాలీలో రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్ల రవికాంత్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, పార్టీ నాయకులు ధనుంజయ, మహేశ్, శ్రీరాములు, పర్వతాలు, సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రేణుల్లో 'ఐక్యత' జోష్

కడ్తాల్: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి శుక్రవారం మండల కేంద్రంలో అభిమానులతో పాటు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కడ్తాల్ నుంచి కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. కడ్తాల్ మండల కేంద్రానికి విచ్చేసిన రాఘవేందర్‌రెడ్డికి పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. ముచ్చర్లగేట్ నుంచి తలకొండపల్లి చౌరస్తా వరకు, టపాసుల మోతతో, మహిళల, యువకుల నృత్యాలతో హోరెత్తించారు. మైసిగండి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, సర్పంచ్‌లు శంకర్, పాండునాయక్, మాజీ సర్పంచ్ శ్రీరాములు పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన 'వాయిస్ ఫర్ గర్ల్స్'

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని నల్లకంచె ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ గర్ల్స్‌శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 21 నుంచి ప్రారంభమైన ఈ క్యాంపులో జిల్లాలోని ఆరు గురుకుల పాఠశాలల నుంచి సుమారు 124 మంది ఎంపిక చేసిన విద్యార్థినులు శిక్షణ పొందారు. సమాజంలో ఆడపిల్లల పట్ల చూపే వివక్షత, వేధింపులను, దాడులను సులభంగా ఎలా ఎదుర్కోవాలి, కౌమారదశలో వచ్చే శారీరక మార్పులు, మానసిక ఆందోళనలను అదుపులో ఉంచుకోవడం, నాయకత్వ పటిమ, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ ముగింపు కార్యక్రమంలో క్యాంపు సమన్వయకర్త శ్వేత, గురుకుల ప్రిన్సిపల్ లీలావతి, షీ టీమ్ సభ్యులు ఎల్లమ్మ, కుమార్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రమాదాలను నివారించేందుకు 'సేఫ్టీ మోకులు'

కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

అబ్దులాపూర్‌మెట్: కల్లుగీత వృత్తిలో ప్రమాదాలను నివారించేందుకు సేఫ్టీ మోకులు అందించేందుకు యత్నిస్తున్నామని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన కారింగుల సత్తయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా కార్పొరేషన్ నుంచి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మృతి చెందిన గీత కార్మికులను ఆదుకునేందుకు గీతన్న బీమా ద్వారా ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్, సర్పంచ్ రంగయ్య, లష్కర్‌గూడ ఎంపీటీసీ సభ్యుడు సాయికుమార్ గౌడ్, సంఘం సొసైటీ అధ్యక్షుడు బాల్‌రాజు, గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాలుగౌడ్, శ్రీశైలం గౌడ్, గుర్జిని వెంకటేశ్ గౌడ్, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలకు కేంద్రం నిధులు



అబ్దుల్లాపూర్‌మెట్: మాట్లాడుతున్న అశోక్‌గౌడ్



ఆమనగల్లు: విఠాయిపల్లిలో బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణలో అమలవుతున్న పథకాలకు కేంద్రమే నిధులు ఇస్తున్నాయని బీజేపీ ఇబ్రహీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యాక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పుదుచ్చేరి విస్తారక్ వడివేలుతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బీజేపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణు గౌడ్, సర్పంచ్ వీరస్వామిగౌడ్, నాయకులు పాపయ్యగౌడ్, గోవర్ధన్, కుమార్, ఎంసీ యాదగిరి, రమాదేవి, సురేఖ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన ప్రజారంజక పథకాలను వివరించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకుడు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి మదం ఆధ్వర్యంలో కౌన్సిలర్ సుజాత, చెక్కల లక్ష్మణ్, బూత్ అధ్యక్షుడు నర్సింహ, జగదీశ్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ బీజేపీ విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, గన్యానాయక్, జంగాచారి, సత్యం, లక్ష్మారెడ్డి, అంజయ్య, జంగయ్య, శివలింగం, రమేశ్, శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు శ్రమిద్దాం

తలకొండపల్లి: రానున్న సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని స్వర్ణశక్తి కర్ణ అభియాన్ పనుల పర్యవేక్షకుడు షణ్ముగ సుందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 18, 19, 20, 21 బూత్‌లలో స్వర్ణశక్తి పనుల్లో భాగంగా పార్టీ పటిష్టత, తొమ్మదేళ్లలో పీఎం మోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమాభివృద్ధి పథకాలు ప్రజలకు చేరాయా లేదా ఇంటింటికి తిరుగుతూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు, నాయకులు సూచనలు, సలహాలిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు పోరాటం చేయాల్సిన అవసరం ప్రతీ కార్యకర్త పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్, జిల్లా కార్యదర్శి పాండు ప్రసాద్, యువ మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు నాగరాజు, శ్రీను, ప్రహ్లాద్, రవి, మైనార్టీ అధ్యక్షుడు జహంగీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, సుదర్శన్, హరికాంత్, శ్రీశైలం, శక్తి కేంద్ర ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆమనగల్లు: పట్టణంలోని ఉదయనగర్ కాలనీకి చెందిన పాతకోట రాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేశవులు మృతుడి భార్యకు రూ.2వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యులు సత్యం, సాయిలు, రాజు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం

తుర్కయంజాల్: దశల వారీగా వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాగన్నగూడ కౌన్సిలర్ మర్రి మాధవి అన్నారు. శుక్రవారం ఆమె రాగన్నగూడలోని బృందావన్ కాలనీలో రూ.15లక్షల వ్యయంతో చేపడుతున్న యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సామ భీంరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.